అప్పుడు అలా.. ఇప్పుడు ఇలా..!

వరద కాలువలోకి మురుగు కలపబోమని రాసిచ్చి.. సడిచప్పుడు లేకుండా కలిపేందుకు యత్నించి.!



వరద కాలువలోకి డ్రైనేజీ పైపులైన్లు కలపడాన్ని అడ్డుకుంటున్న సెంట్రల్‌బ్యాంక్ కాలనీవాసులు

- వరద కాలువలోకి డ్రైనేజీ లైన్లు కలుపే పనులను అడ్డుకున్న కాలనీవాసులు
- జీహెచ్‌ఎంసీ అనుమతులు లేకుండా ఎలా చేపడతారని ఆగ్రహం
- జలమండలి అధికారులు, సిబ్బంది తీరుపై అసహనం

మన్సూరాబాద్: కోట్ల రూపాయలతో నిర్మించిన వరద కాలువ నాలాలోకి జలమండలి అధికారులు డ్రైనేజీ మురుగు కలిపే యత్నాన్ని కాలనీవాసులు శుక్రవారం అడ్డుకున్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి సెంట్రల్‌బ్యాంక్‌కాలనీలోని ఉమానాగలింగేశ్వరస్వామి ఆలయం నుంచి చంద్రపురికాలనీ వరకు వరదకాలువ నిర్మాణం చేపట్టారు. నిర్మాణ సమయంలో సెంట్రల్‌బ్యాంక్‌కాలనీవాసులు వరదకాలువలోకి మురుగును కలుపుతారనే ఊహించి నిర్మాణ పనులను అడ్డుకున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో వరద కాలువలోని మురుగు నీటిని కలుపేది లేదని పేర్కొంటూ జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు కాలనీ సంక్షేమ సంఘానికి రాతపూర్వకంగా రాసి ఇచ్చి పనులను ప్రారంభించారు.

అడ్డుకుంటే చర్యలంటూ హెచ్చరికలు..

తీరా ఇప్పుడు కాలనీ సంక్షేమ సంఘానికి సమాచారం ఇవ్వకుండా జలమండలి అధికారులు వరదకాలువలోకి మురుగునీటిని కలుపేందుకు పనులు ప్రారంభించారు. దీంతో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులతో పాటు కాలనీవాసులు సంఘటన స్థలానికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. జలమండలి డీజీఎం మాధవి డ్రైనేజీ మురుగు కాలువ పనులు చేపట్టేందుకు తమకు అనుమతులు ఉన్నాయని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు చేపడుతామని అడ్డుకుంటే చర్యలుంటాయని హెచ్చరించారు. అయినప్పటికీ కాలనీవాసులు భీష్మించడంతో జలమండలి అధికారులు తోకముడిచారు.

వారి కోసమే అధికారుల పాకులాట..

ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జక్కిడి తిరుమల్‌రెడ్డి, ఠకూర్ రాకేష్‌సింగ్ మాట్లాడుతూ జలమండలి అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించి వరద కాలువలోని మురుగు కలిపేందుకు యత్నిస్తున్నారని అన్నారు. ఎల్‌పీటీ మార్కెట్ వెనుకవైపు సుమారు 1100 నివాసాలతో బహుళ అంతస్తుల నిర్మాణం జరిగిందని దాని కోసమే అధికారులు పాకులాడుతున్నారని ఆరోపించారు. బహుళ అంతస్తుల నిర్మాణదారులు ఎస్‌టీపీలను ఏర్పాటు చేసి శుద్ధి చేసిన నీటిని మాత్రమే బయటకు వదలాల్సి ఉందన్నారు. కానీ వారు దానికి విరుద్ధంగా జలమండలి అధికారులు తమ వర్క్ ఆర్డర్‌లోనే డ్రైనేజీ మురుగు కాలువ అని పేర్కొన్నారని తెలిపారు.



డ్రైనేజీ పైపులైన్లు కలపమని అధికారుల హామీ పత్రం

ఉదయం డీడీలు.. మధ్యాహ్నానికి అనుమతులు

గత నెల 5వ తేదీన సదరు బహుళ అంతస్తుల నిర్మాణదారులు జలమండలికి డీడీలు చెల్లించారని తెలిపారు. అదే రోజున జలమండలి అధికారులు నిర్మాణ పనులకు అనుమతులివ్వడంపై వారు మండిపడ్డారు. జలమండలి అధికారులు పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకుని జీహెచ్‌ఎంసీ నిర్మించి వరదకాలువకు డ్రైనేజీని కలుపుతామని అనుమతులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనే మురుగునీటిని వరదకాలువలో కలుపనీయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు విద్యాసాగర్, భైరవరెడ్డి, కృష్ణప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, సురేష్‌కుమార్‌గౌడ్, సుబ్రమణ్యం, గోపాల కృష్ణమూర్తి, కోటిరెడ్డి, వినోద్‌ప్రసాద్ తివారి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు

వరద కాలువలోని మురుగు కలపాలని జలమండలికి జీహెచ్‌ఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. జలమండలి అధికారులు జీహెచ్‌ఎంసీ అధికారులకు ముందస్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. కాలనీవాసుల ఫిర్యాదు మేరకు జలమండలి అధికారులను పనులు నిలిపేయాలని ఆదేశించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడుతాం.

– స్వప్న, మన్సూరాబాద్ డివిజన్ ఏఈ

సామాజిక సేవ బాధ్యతగా గుర్తించాలి

వైదేహి ఆశ్రమ కార్యదర్శి పొనుగంటి ప్రకాశరావు

సైదాబాద్: ఎంతో తీరిక లేని జీవితాన్ని గడుపుతున్నా అప్పుడప్పుడైనా సామాజిక సేవ చేయడాన్ని అందరూ తమ బాధ్యతగా గుర్తించాలని వైదేహి నిరాశ్రిత బాలికల ఆశ్రమం కార్యదర్శి పొనుగంటి ప్రకాశరావు అన్నారు. సామాజిక సేవారంగంలో పొనుగంటి ప్రకాశరావు అందించిన విశేషసేవలను వరల్డ్ కల్చరల్ ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ కమిషన్ సంస్థ గుర్తించింది. ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఐఎస్‌సదన్ డివిజన్ సరస్వతీనగర్‌లోని వైదేహి బాలికల ఆశ్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో పలు రంగాలకు చెందిన వారు ఆయనను అభినందించారు. స్వచ్ఛందంగా సేవలు అందిస్తూ ప్రకాశరావు ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారని పలువురు కొనియాడారు. అనంతరం ప్రకాశరావు మాట్లాడుతూ.. అవార్డులు సేవా కార్యక్రమాలు కొనసాగించడానికి మరింత ప్రోత్సాహాన్ని కలిగిస్తాయని అన్నారు.

చేనేత పడుగు పేకల ఆత్మీయ కలయికను జయప్రదం చేయాలి



జిల్లాల పర్యటనను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు

మన్సూరాబాద్: తెలంగాణ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో డిసెంబర్ 10న బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చేనేత పడుగు పేకల ఆత్మీయ కలయిక సమావేశాన్ని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు పిలుపునిచ్చారు. సమావేశం జయప్రదం కావాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్ జిల్లాల పర్యటనను చేపడుతున్నారు. మన్సూరాబాద్ డివిజన్ సహారాస్టేట్స్‌కాలనీలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద జెండా ఊపి పర్యటన కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్సీ శుక్రవారం ప్రారంభించారు.

- ఈ సందర్భంగా సీతారాములు మాట్లాడుతూ... మహోన్నత చరిత్ర కల్గిన చేనేత పరిశ్రమ, చేనేత కార్మికుల జీవితాలు నేడు కడు దయనీయంగా మారాయని అన్నారు. పాలకుల లోపభూయిష్ట విధానాలతో చేనేత వృత్తి సంక్షోభంలో కురుకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కార్మికుల ఆకలిచావులు, ఆత్మహత్యలు, వలసలను నియంత్రించేందుకు చేనేత పడుగు పేకల ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు.
- ఈ సమావేశంలో పలు డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచనున్నట్లు స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలో సంఘం అధ్యక్షుడు పర్యటించి చేనేత కార్మికులను ఐక్య పరచనున్నట్లు తెలిపారు. రాజకీయ అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా విశాల ప్రాతిపదికన చేనేత కార్మికులతో కలిసి సంఘటిత ఉద్యమంతో ముందుకు పోతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్, గోవర్ధన్, శేఖరయ్య, పెంటయ్య, వెంకటేశం, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేయాలి



లింగోజిగూడ: కాలనీవాసులకు ఇబ్బంది లేకుండా అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గౌతమ్ నగర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. కాలనీలలో ఎలాంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌గౌడ, శ్రీధర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రాకేష్, రోహిత్‌రెడ్డి, శ్రీనాథ్, నరేందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం అధికారులతో కలిసి కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ రోడ్డు లెవల్స్‌ను సరిచేసుకుంటూ పనుల చేపట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రాబోయే కాలంలో కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కాలనీల అభివృద్ధిలో స్థానికుల భాగస్వాముం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ దామోదరరావు, ఏఈ రాజ్‌కుమార్, కాలనీ సభ్యులు దామోదర్‌రెడ్డి, కృష్ణ, మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అనసూయ

మలక్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి పదినెలలు గడస్తున్నా విద్యారంగ సమస్యలపై దృష్టి సారించడం లేదని పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనసూయ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి. మహేష్ అన్నారు. పీడీఎస్‌యూ గ్రేటర్ హైద్రాబాద్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మలక్‌పేట ప్రభుత్వ జూనియర్ కాలేజ్ నిర్వహించిన సమావేశానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయడంలో ప్రభుత్వం తీవ్రజాప్యం చేస్తోందన్నారు. ఫీజుల కోసం ప్రైవేట్ యాజమాన్యాలు విద్యార్థులను వేధింపులకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఇంటర్మీడియేట్ విద్య విధానం కార్పొరేట్ల కబంధ హస్తాల్లోకి పోయిందన్నారు. ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేసి కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ అరికట్టాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పీడీఎస్‌యూ పోరాటం కొనసాగిస్తుందని అన్నారు. ఈ సమావేశంలో గ్రేటర్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు గౌతమ్, రహీం, పీఓడబ్ల్యూ జిల్లా నాయకులు నవ్య, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమించి ప్రహరీ నిర్మాణం!



ప్రగతినగర్‌కాలనీలో రోడ్డును ఆక్రమించి చేపడుతున్న ప్రహరీ నిర్మాణం

చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

మన్సూరాబాద్: డివిజన్ పరిధి ప్రగతినగర్‌కాలనీలోని ప్లాట్ నం.12 పీఎస్‌ఎం రావు అనే వ్యక్తి సుమారు 12 ఫీట్ల రోడ్డును ఆక్రమించి ప్రహరీ నిర్మాణం చేపడుతున్నాడని.. సదరు నిర్మాణదారుడిపై చర్యలు చేపట్టాలని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం హయత్‌నగర్ సర్కిల్ డీసీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నేతలు మాట్లాడుతూ... రోడ్డును ఆక్రమించి చేపడుతున్న నిర్మాణంతో రోడ్డు కుదించుకపోతుందని, దీంతో ట్రాఫిక్ సమస్యలు తెలుత్తుతాయని స్పష్టంచేశారు. ఒకరును చూసి కాలనీలోని మిగితావారు కూడా రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి సదరు నిర్మాణదారుడిపై చర్యలు చేపట్టి, రోడ్డును ఆక్రమించి చేపడుతున్న నిర్మాణాన్ని కూల్చివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ వేల్ఫేర్ అధ్యక్షుడు అర్జున్‌రావు, ప్రధాన కార్యదర్శి సైదిరెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, సతీష్‌కుమార్ గోయల్, సీతారామ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

24న రెడ్లు, పద్మశాలీల కార్తీక వనభోజనాలు

మన్సూరాబాద్: ఈనెల 24న ఆటోనగర్‌లోని డీర్ పార్కు పక్కనవున్న అనన్య ఎకో రిసార్ట్స్‌లో రెడ్ల కార్తీకమాస వనభోజనాల కార్యక్రమాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు పిట్ట శ్రీనివాస్‌రెడ్డి కోరారు. కార్తీక వనభోజనాల కార్యక్రమ ఏర్పాట్లను శుక్రవారం ఆయనతో రెడ్డి సంఘాల నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రెడ్డి జాగృతి, రెడ్డి ఉమెన్స్ అసోసియేషన్, రెడ్డి జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రెడ్డి సోదరులు తమ కుటుంబాలతో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పద్మశాలి సంఘం వనభోజనాలు

మన్సూరాబాద్: అఖిల భారత పద్మశాలి సంఘం మన్సూరాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో ఈనెల 24న మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణంలో కార్తీక మాస వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు గంజి సత్తయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి ఎమ్మెల్సీ ఎల్ రమణ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

రూ.2కోట్లతో భూగర్భ డ్రైనేజీలకు ఔట్‌లెట్ల నిర్మాణం



స్పోర్ట్స్‌మీట్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తదితరులు



అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి డివిజన్ పరిధిలోని శివారు ప్రాంత కాలనీవాసులకు త్వరలో రూ. 2కోట్ల నిధులతో భూగర్భ డ్రైనేజీలకు ట్రంక్ లైన్ నిర్మాణ పనులు చేపట్టి ఔట్‌లెట్ ఏర్పాటు చేయనున్నట్లు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన తన క్యాంప్ ఆఫీసులో ట్రంక్‌లైన్ ఏర్పాటు పనుల గురించి ఎల్‌బీనగర్ జోనల్ సిటీప్లానర్ శ్రీనివాస్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్యామ్సన్‌లతో సమాక్షా సమావేశం నిర్వహించారు. సాహెబ్‌నగర్‌లోని రాచకాలువను మరోమారు సర్వే చేసి హద్దులు గుర్తిస్తే ట్రంక్ లైన్ పనులు ప్రారంభించేందుకు ఆటంకాలు ఉండవన్నారు. వెంటనే రాచకాలువను సర్వే చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవిందరెడ్డి, ఇరిగేషన్ అధికారులు శుక్లా, సతీష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సంక్షేమ సంఘ భవనం నిర్మాణం చేపట్టాలి: అరవిందరెడ్డి

బీఎస్‌రెడ్డి డివిజన్ పరిధిలోని శ్రీపాపిరెడ్డికాలనీలో సంక్షేమ సంఘ భవన నిర్మాణం చేపట్టాలని డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవిందరెడ్డి ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. త్వరలో ప్రత్యేక నిధులతో సంక్షేమ సంఘ భవనం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు.

స్పోర్ట్స్‌మీట్ నిర్వహించడం అభినందనీయం: ఎమ్మెల్యే

దిల్‌సుఖ్‌నగర్: స్పోర్ట్స్ మీట్‌తో విద్యార్థులో శారీరక, మానసిక ఆరోగ్యంతో ఉంటారని స్పోర్ట్స్ మీట్‌ను ప్రోత్సహిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యాసంస్థ నిర్వాహకులకు అభినందనలు తెలియజేస్తున్నామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలియజేశారు. శుక్రవారం సరూర్‌నగర్ స్టేడియంలో నారాయణ స్కూల్ స్పోర్ట్స్‌మీట్ కార్యక్రమ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, రాచకొండ డీసీపీ ప్రవీణ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎంలు రవీంద్రబాబు, మనోహర్‌రెడ్డి, రమణారెడ్డి, శివరంజనీ, మహేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని విజయవంతం చేయండి

రాష్ట్ర వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ డైరెక్టర్ శైలజ





దివ్యాంగుల సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ శైలజ, హాజరైన దివ్యాంగులు

చాదర్‌ఘాట్: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని డిసెంబర్ 3వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ డైరెక్టర్ బి.శైలజ అన్నారు. శుక్రవారము మలక్‌పేటలోని దివ్యాంగుల సంక్షేమశాఖ రాష్ట్ర కార్యాలయంలో దివ్యాంగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈనెల 27, 28న గచ్చిబౌలిలో దివ్యాంగులకు రాష్ట్రస్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. డిసెంబర్ 3న రవీంద్రభారతిలో జరిగే అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవానికి మంత్రి సీతక్క హాజరవుతారని తెలిపారు. అదే రోజు ఆటల పోటీల్లో గెలుపొందిన జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడాకారులకు బహుమతులు అందజేస్తామన్నారు. అందరూ ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ఏడీ రాజేందర్, వికలాంగుల సంఘాల నాయకులు నారా నాగేశ్వరరావు, శ్రీశైలము, ఎన్‌పీఆర్‌డీ రాజేందర్, భారతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ల సమస్యలపై జోనల్ కమిషనర్‌కు ఏకరువు

నాగోలు: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని ఉన్న అన్ని సర్కిల్లో ప్రజలు సీజనల్ వ్యాధులు, దోమలతో విషజ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీఎస్పీ ఎల్‌బీనగర్ అధ్యక్షుడు మేముగంటి సంపత్ శుక్రవారం జెడ్‌సీ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ.. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో దోమకాటు ద్వారా విషజ్వరాలతో డెంగీ, మలేరియా, చికూన్ గన్యా ఇతర వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులను అప్రమత్తం చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు బండారి రవి, బివిఎస్ కన్వీనర్ దాసవి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ దీపాల కొరత ఉంది..

కొత్తపేట డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలపైన శుక్రవారం కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలసి వినతి పత్రాన్ని అందజేశారు. వెంటనే నూతన సీసీ రోడ్డు పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కాలనీలలో విద్యుత్ దీపాల కొరత ఎక్కువ ఉందని అన్నారు.

నిధులు మంజూరు చేయాలి..

నాగోలు డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ శుక్రవారం జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిసి డివిజన్ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. నాగోలు డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్ కాలనీలో సీసీరోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జోనల్ కమిషనర్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరావు

నాగోలు: కొత్తపేట సత్యానగర్‌లోని హరిహర క్షేత్రం, వాకింగ్ ట్రాక్ పరిసరాల్లో అసాంఘిక కార్యాకలాపాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటామని చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ వెంటేశ్వరరావు తెలిపారు. గురువారం రాత్రి ఎస్‌ఐ భద్రయ్య ఇతర ఇబ్బందితో కలిసి సత్యానగర్‌కాలనీలోని నల్లపోచమ్మ ఆలయం, హరిహర క్షేత్రం సహా పరిసరాల్లో పర్యటించారు. ఆలయాల పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని పోలీసులను స్థానికులు కోరారు.

అయ్యప్ప మాలధారుడిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు

నాగోలు: ఓ హోటల్ వివాదంలో అయ్యప్పస్వామి మాలలో ఉన్న వ్యక్తిపై దాడి చేసిన వ్యక్తిపై ఎల్‌బీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. కామినేని హాస్పిటల్ ఎదురుగా ఉన్న బాలాజీ హోటల్ వద్ద కొన్ని రోజులు ఇద్దరి మధ్య న వివాదం జరుగుతోంది. అక్కడ అయ్యప్ప మాలలో ఉన్న సురేష్ బుధవారం తన కుటుంబ సభ్యులతో కలిసి హోటల్ ముందు ఉన్నాడు. సెటిల్మెంట్ కోసం అక్కడ వచ్చిన పాత నేరస్తుడు కుంభం శ్రీనివాస్‌రెడ్డి అయ్యప్ప మాలలో ఉన్న సురేష్ దాడి చేశాడు. అక్కడ హోటల్‌లో పనిచేసే గిరిజన మహిళలపై దాడి చేశాడు. శ్రీనివాస్ రెడ్డి దాడి చేసిన సంఘటన అక్కడ ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. దీంతో బాధితుడు సురేష్ సోషల్ మీడియాలో తనపై జరిగి దాడి వీడియోలు విడుదల చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మహిళ మృతి



నాగోలు: మానసిక వ్యాధితో బాధపడుతున్న ఓ గుర్తుతెలియని మహిళ ఆశ్రమంలో మృతి చెందిన సంఘటన నాగోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... తట్టిఅన్నారం పరిధిలోని ఆర్‌కేనగర్‌లో ఓ గుర్తు తెలియని మహిళ(30) మానసిక వ్యాధితో బాధపడుతున్నట్లు స్థానికులు గుర్తించి నాగోలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు తట్టిఅన్నారం చేరకుని గుర్తు తెలియని మహిళ వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఆమెను అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతంలోని ఆలేటి ఆశ్రమంలో చేర్పించారు. సదరు మహిళ అనారోగ్యంతో మృతి చెందినట్లు గురువారం రాత్రి నాగోలు పోలీసులకు ఆశ్రమ నిర్వాహకులు సమచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

నాగోలు: ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నేత అనంతుల సురేందర్ రెడ్డి రెండో కూతురు జాన్వీ–యశ్వంత్‌రెడ్డి రిసెప్షన్ గురువారం రాత్రి నగరంలోని ఓ కన్వెన్షన్‌లో జరిగింది. ఈ వేడుకకు టీపీసీసీ క్యాంపెయినింగ్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఎనుముల కృష్ణారెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

